


దేశ భాషలందు తెలుగు లెస్స అని కృష్ణదేవరాయలు అన్నా,
తేనె కన్నా తీయనిది తెలుగు భాష అని మరొకరు అన్నా,
ఇప్పటికీ తెలుగు భాషకు సరైన గుర్తింపు లభించలేదనేది నిర్వివాదాంశం.
తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలని ఎన్ని డిమాండ్లు వచ్చినా
ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది.
ఈ నేపథ్యంలో టెక్నాలజీ ఊపందుకోవడం, ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో
ఆయా ప్రాంతీయ భాషల్లోనే వెబ్‌సైట్లు తయారవుతున్నాయి.
మన మాతృభాషలో కంప్యూటర్లు లేకపోవడంతో
ఈ విషయంలోనూ తెలుగు భాష వెనకబడిపోయిందనే చెప్పాలి.
ఈ తరుణంలో 'ప్రజలచేత, ప్రజలకొరకు, ప్రజల చెంతకు...' అనే స్ఫూర్తితో,
మాతృభాషలో కంప్యూటర్‌ను సామాన్యుల దరి చేర్చే ఒక సమున్నత ఆశయంతో
రూపొందించబడిందే 'స్వేచ్ఛ' సాఫ్ట్‌వేర్.... అదే ఫ్రీ సాఫ్ట్‌వేర్....




# నేడు ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫ్రీడం డే

ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ఫ్రీడం డేను ఈ నెల 28వ తేదీన జరుపుకుంటున్నారు. 2005 ఫిబ్రవరిలో మొట్టమొదటిసారిగా తెలుగులో తొలి సాఫ్ట్‌వేర్‌ను విడుదల చేసిన విషయం పాఠకులకు విదితమే. ప్రతి ప్రోగ్రామర్ రోజుకొక లైన్ చొప్పున తెలుగులో ఎన్‌కోడ్ చేయడం ద్వారా పరిపూర్ణమైన తెలుగు సాఫ్ట్‌వేర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, ఈ ఉద్యమం ఆ రోజు పిలుపునిచ్చింది. దానికి అంకురార్పణే స్వేచ్ఛా సాఫ్ట్‌వేర్. దినదినాభివృద్ధి చెందుతూ అనేక మైలురాళ్లను దాటుకుంటూ మునుముందుకు పోతున్న స్చేచ్ఛా సాఫ్ట్‌వేర్, సి.పి.బ్రౌన్ నిఘంటువును తమ వెబ్‌సైట్‌లో పొందుపరచి, మొత్తం డిక్షనరీని అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లీష్‌లో మనం ఇచ్చిన పదానికి తన సెర్చ్ మెకానిజం ద్వారా తెలుగు అర్థాన్ని తెలియజేసేందుకు వీలుగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దీనిని http://dict.swecha.org/ సైట్‌లో పొందవచ్చు. కంప్యూటర్ తెలుగు పాటలు పాడటం, తెలుగు సినిమాలు చూపించడం, తెలుగు కథలను ప్రచురించడం, మనకు తెలిసిందే. అయితే ఈ ఉద్యమం మరో అడుగు ముందుకేసి కంప్యూటర్స్ చేతనే తెలుగును చదివించింది. తెలుగు చదవడం అంటే కంప్యూటర్ తెలుగును నేర్చుకోవడం కాందండోయ్, తెలుగులో వున్న కథలను, వ్యాసాలను చదివి వినిపిస్తుంది. అది కథా, వ్యాసమా, రచనా, కావ్యమా అనేది మాత్రం కంప్యూటర్‌కు అక్కర్లేని విషయం. కానీ ఈ సాఫ్ట్‌వేర్ చదివి వినిపించాలంటే తెలుగుపాఠం మటుకు యునికోడ్ (యునికోడ్‌కు సంబంధించిన అనేక విషయాలు గతవారం (21-9-2006 గురువారం) చిప్స్ పేజీలో ప్రచురించడం జరిగింది)లో వుండాల్సిందే. ఇటువంటి అనేక కరకాలైన మార్పులు చేర్పులతో ముందుకు సాగుతోంది ఫ్రీసాఫ్ట్‌వేర్. ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న నిర్వహించే సాఫ్ట్‌వేర్ ఫ్రీడం డేను ఈ నెల 28వ తేదీన వినూత్నంగా నిర్వహిస్తున్నారు. భౌగోళికంగా అనేక ప్రాంతాల్లో వున్న 1000మంది ప్రోగ్రామర్లు సైబర్ స్పేస్‌లో..., అదేనండి మన ఇంటర్నెట్‌లో ఒకదగ్గర చేరి 50వేల లైన్ల సాఫ్ట్‌వేర్ కోడ్‌ను తెలుగులోకి మార్చనున్నారు. తద్వారా ఒక పరిపూర్ణమైన డెస్క్‌టాప్ ప్రజలు సులువుగా ఉపయోగించుకొనేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్లన్నీ తెలుగులో అందుబాటులోకి వస్తాయి.

స్వేచ్ఛ లైవ్ సీడీ డౌన్‌లోడింగ్ కోసం :
http://www.swecha.org/wiki/ Download_LiveCD
ఫాంట్స్ ఇన్‌స్టాలేషన్ కోసం : http://www.swecha.org/wiki/Fonts
కీబోర్డ్ సెటప్ కోసం : http://www.swecha.org/wiki/Input

1998లో ఇంటర్నెట్ వినియోగం ప్రపంచ జనాభాలో 2.49శాతం వుండగా, 2005నాటికి అది ఆరు రెట్లు పెరిగి 16శాతం అయింది. ఈ కాలంలోనే మన దేశంలో కూడా ఇంటర్నెట్ వీక్షకుల సంఖ్య 0.1 శాతం నుండి 4.5శాతానికి పెరిగింది. దీన్ని బట్టి ఇంటర్నెట్ వినియోగం ఎంత వేగంతో అభివృద్ధి అవుతుందో అర్థం చేసుకోవచ్చునని 'సేచ్ఛా డాట్ ఆర్గ్' వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ఇంగ్లీషేతర వెబ్ కంటెంట్ 31.6శాతం వున్నది. దీనికి ముఖ్యంగా జపాన్, చైనా వంటి ఇతర లాటిన్ భాషల వెబ్‌సైట్లు కూడా వుండడం మూలంగా ఇది సాధ్యమైంది. ఈ భాషలలో ఇంటర్నెట్ పెరుగుదలకు ముఖ్యకారణం ఆయా భాషల్లో కంప్యూటర్ అందుబాటులో వుండడమే. తెలుగు భాషకు సంబంధించి- ఇంటర్నెట్‌లో వున్న కంటెంట్ ఏదైనా వుందీ అంటే, అది పత్రికల ద్వారా వచ్చిందేనని వీరు పేర్కొంటున్నారు. అయితే ఇంటర్నెట్‌లో తెలుగు అంశాల అభివృద్ధికి కంప్యూటర్ విజ్ఞానం ప్రజల్లోకి చొచ్చుకుపోవడానికి సామాన్యులు కంప్యూటర్లు వినియోగించుకోడానికి ఈ స్ప్రింట్ దోహదపడుతుందని వారంటున్నారు. 'కమ్యూనిటీ టూ కమ్యూనిటీ' ఈ స్ప్రింట్ యొక్క ముఖ్యోద్దేశమని వారు పేర్కొంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక తనిఖీ కేంద్రంలో ఈ వేయిమంది ప్రోగ్రామర్లు చేస్తున్న ఈ తర్జుమాలను తనిఖీ నిర్వహించి, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేవిధంగా కృషిచేస్తున్నట్లు వీరు ప్రకటించారు. దీనికి పత్రికల్లోని అనేకమంది మిత్రులు కూడా సహకరించనున్నట్లు వారు ప్రకటించారు. ప్రజలవద్దకు పాలన, పల్లెబాటలు ప్రజలకెంత దగ్గరయ్యాయో తెలియదుకానీ, 'ప్రజలచేత, ప్రజలకొరకు, ప్రజల చెంతకు...' అనే స్ఫూర్తితో కంప్యూటర్‌ను సామాన్య ప్రజల ముంగిటనుంచేందుకు జరుగుతున్న ఈ మహాయజ్ఞం ఎందరికో స్ఫూర్తిదాయకం. దీనిలో భాగస్వాములు కావాలనుకునేవారు localisation@swecha.org మెయిలింగ్ లిస్ట్‌లో చేరి సహకరించవచ్చు.

– 'చిప్స్' డెస్క్